

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## పేదలకు ఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి సాయం

**- సర్వేపల్లిలో రూ.8 కోట్లు దాటేసిన సీఎంఆర్ఎఫ్**

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 53 మందికి రూ.39.53 లక్షల విలువైన చెక్కుల పంపిణీ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సర్వేపల్లిలో రూ.8.14 కోట్లు 882 మందికి సాయం అందించామన్నారు. ఎన్ని దరఖాస్తులు పంపినా ఉదారంగా ఆర్థిక సాయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు మంజూరు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

## రొట్టెల పండుగలో ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమం



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. నెల్లూరులోని బారాషహిద్ దర్గా రొట్టెల పండుగలో కూడా చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు భాగస్వాములై, ఇతర దేశాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు నర్సింగ్ కళాశాల విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తున్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి..

**- పరిష్కార వేదికకు 332 అర్జీలు**

**- జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్**



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - కలెక్టరేట్** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కేశవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, సర్వే ల్యాండ్ రికార్డుల డిడి నాగశేఖర్‌తో కలిసి డిఆర్ఓ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. వివిధ ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రూ. 7 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యేచే శంకుస్థాపన



**గూడూరు, జూన్ 29, ప్రభాతవార్త** ఎన్నికలకు ముందు పర్యటనకు వచ్చినప్పుడు విందూరు రోడ్డు అద్వా నంగా ఉందని ప్రజలు తెలియజేశారని కూటమి ప్రభుత్వం వస్తే రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చామని ఇచ్చిన హామీ మేరకు ఏడు కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునిల్ కుమార్ వెల్లడించారు. గూడూరు మండలం విందూరు గ్రామానికి నూతన రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక మధు రెడ్డి కాలనీ వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విందూరు రోడ్డు అద్వాన స్థితిలో ఉందని గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా వేయలేదని గుర్తు చేశారు ఎన్నికలకు ముందు ప్రచారానికి వచ్చినప్పుడు రోడ్డు నిర్మాణం గురించి ప్రజలు తెలియజేశారని కూటమి ప్రభుత్వంవస్తే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చామని అన్నారు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్నామని ఈ చుట్టుపక్కల గ్రామాల వారందరికీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అభివృద్ధిని చూసి మాట్లాడాలని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, రహీం, మల్లికార్జున్ రెడ్డి, వెంకటేశ్వరరాజు, శ్రీదేవి భారతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి



**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా..**



**చిల్లకూరు, జూన్ 29, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారిపాలెం లో పర్యటించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా..సోమవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎస్పి అజిత వేజెండ్ల, జేసి మొగిలి వెంకటేశ్వర్లు..లతో కలిసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్అండ్‌బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం..** అంతకుముందు పున్నపువారిపాలెం, ఓడూరు, రెట్టపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు నూతన సర్వీసును గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం సునీల్ కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, డిఆర్డీఏ,మెప్మా పిడీలు నాగరాజ కుమారి, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, పౌర సరఫరాల శాఖ డీఎం అర్జున రావు, డిఎస్ఓ పుల్లయ్య, డీఎస్పీ గిరిధర్, కన్వర్ రొయ్యల పరిశ్రమ డైరెక్టర్ గంటా మధు కృష్ణనాయకులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, ఓడూరు సత్యనారాయణరెడ్డి చిట్టేటి నారాయణ చిట్టేటి కీరవాణి మట్టం శ్రావణి రెడ్డి గుండాల భారతి మరి కొంతమంది నాయకులుఅన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాపై
## వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించిన ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలు, రెవిన్యూ వసూళ్లు, నిర్వహణకు సంబంధించిన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాలను వెంటనే గుర్తించి త్వరితగతిన పరిష్కరించి వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు. అన్ని కార్యాలయాలలో సిటిజన్ చార్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే సైక్లోన్ ప్రివెంటివ్ మెయింటెనెన్స్ పనులకు సంబంధించి అవసరమైనప్పుడు వెంటనే ఆదేశాలు జారీ చేసి, అనుమతులు పొందుతూ పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. గతంలో వచ్చిన తుఫానులకు సంబంధించిన పెండింగ్ పీఎం ఆర్డర్లను ఇప్పుడు పంపవద్దని స్పష్టం చేశారు. అదేవిధంగా పగటి సమయంలో వీధి దీపాలు ఎక్కడా వెలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, వీధి దీపాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి శుక్రవారం లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను శాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, వినియోగదారుల వద్దకు వెళ్లి సేవలపై అభిప్రాయాలను సేకరించాలని, వారు సంతృప్తిగా ఉన్నారా..? లేదా.. అని తెలుసుకోవాలని ఫీల్డ్ అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారుల సంతృప్తి, సేవల నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అదేవిధంగా రెవిన్యూ వసూళ్ల పూర్తిగా డిజిటలైజేషన్ రూపంలో రావాలని, వినియోగదారులు డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గుచూపేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రెవిన్యూ సిబ్బందిఫీల్డ్ సిబ్బంది ప్రతి వినియోగదారునికి డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలను వివరించి, పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎండీ సూచించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, లత, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా రెండవ రోజు పల్స్ పోలియో కార్యక్రమం



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు జిల్లాలో పల్స్ పోలియో దిగ్విజయంగా నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం రెండవ రోజు సోమవారం 12,045 మంది (4.99) ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసినట్లుగాను, రెండు రోజులకు కలిపి జిల్లాల గుర్తించిన 2,67,750 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకు గాను 2,66,180 పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు, 99.41 ప్రగతి సాధించినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ వి. సుజాత తెలియజేస్తున్నారు. ఏ కారణం చేతైనా మొదటి మరియు రెండవ రోజు పోలియో చుక్కలు వేయించుకోని ఐదు సంవత్సరంలోపు పిల్లల తల్లిదండ్రులు 30వ తారీకు మంగళవారం మీ ఇంటింటికి వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించినప్పుడు మీ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## మనుబోలు గ్రంధాలయాన్ని పునర్నిరిస్తాం

**జిల్లా గ్రందాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతకుమారి**



**మనుబోలు జూన్ 29 ప్రభాతవార్త** మనుబోలు మండలకేంద్రంలోని ప్రభుత్వ గ్రంధాలయాన్ని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతకుమారి సోమవారం సందర్శించారు. గ్రంధాలయ భవనాన్ని పరిశీలించిన ఆమె దానిదుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె విలేఖర్లతోమాట్లాడుతు మనుబోలు గ్రంధాలయం భవనం పూర్తిగా శిధిలావస్తుకు చేరుకుందని పై కప్పు స్లాబ్‌తోపాటు భవనం ప్రమాదకర సిద్ధతిలో ఉందని తెలిపారు.ఇలాంటి పరిస్థితులలో మా పాఠకులు గ్రంధాలయంకు రాడం అభినందనీయమని అన్నారు. గ్రంధాలయ భవనాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మించాలని నిర్ణయించినట్లు ఆమె వెల్లడించారు.ఈవిషయమై ఇప్పటికే గ్రామ పెద్దలతో చర్చించగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. గ్రందాలయ సెస్ నిధులతోపాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు గ్రామస్తులు దాతల సహకారంతో నూతన భవనాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. విద్యార్థులు,యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న ఈకార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో లైబ్రరియన్ అరుణ్‌కుమార్, గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గోన్నారు.

## కాలువలో పడి వ్యక్తి మృతి

**అల్లూరు, జూన్ 29 ప్రభాతవార్త :** పంట కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లూరులోని బోడిసత్రం వద్ద చోటుచేసుకోంది. స్థానికుల వివరాల మేరకు తూర్పు వీధిలో నివాసం ఉంటూ బాడుగ ఆటో తోలుకుంటూ మరియు రేషన్‌షాపు దుకాణంలో పనిచేసే సుబ్బయ్య (39)మద్యం మత్తులో బోడిసత్రం పంట కాలువలో పడి ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమారటం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కదిలిన యంత్రాంగం.. కంగుతిన్న అజ్ఞాత ఫ్యాక్టరీ!

**- నిబంధనలకు పాతర వేసిన పరిశ్రమపై విడవలూరు తహశీల్దార్ ఆరా..**

**- మంగళవారంలోగా పూర్తి వివరాలు సమర్పించాలని హెచ్చరిక**



**విడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త:** అన్నారెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో బోర్డు లేకుండా దశాబ్దకాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫ్యాక్టరీపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. ఈ అంశంపై ప్రభాతవార్తలో సోమవారం ప్రచురితమైన "చట్టం ఎవరికి చుట్టం? బోర్డు లేని ఫ్యాక్టరీకి ప్రభుత్వ అనుమతులు ఎలా?" అనే కథనం కలకలం రేపడంతో విడవలూరు తహశీల్దార్ ఏ.లక్ష్మీప్రసన్న ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**ప్రశ్నల వర్షం.. అస్పష్టమైన సమాధానం** తనిఖీల్లో భాగంగా ఫ్యాక్టరీ మేనేజర్‌ను పిలిపించి, తహశీల్దార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ భూమి ఎవరి పేరు మీద ఉంది? పరిశ్రమకు సంబంధించి ప్రభుత్వం నుంచి పొందిన అనుమతులు ఏమిటి? పంచాయతీ రికార్డుల్లో ఏమని నమోదు చేశారు? తదితర వివరాలపై ఆమె నిలదీశారు. దీనికి మేనేజర్ స్పందిస్తూ.. "మా హెడ్ ఆఫీస్ వైజాగ్ లో ఉంది, పూర్తి వివరాలు అక్కడి నుంచే అందుతాయి" అని సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు.

**మంగళవారమే గడువు.. ఏం తేలుతుందో?** మేనేజర్ సమాధానంతో అసంతృప్తి చెందిన తహశీల్దార్, మంగళవారం సాయంత్రం లోపు ఫ్యాక్టరీకి సంబంధించిన పూర్తి పత్రాలు, అనుమతులు మరియు అన్ని రికార్డులను తన కార్యాలయంలో సమర్పించాలని కఠినంగా ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ, బోర్డు లేకుండా ఇన్నాళ్లు కార్యకలాపాలు సాగించిన తీరుపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కొనసాగుతున్న గ్రామస్థుల అనుమానాలు** అధికారుల స్పందన పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, లోపల జరుగుతున్న కార్యకలాపాలపై అనుమానాలు వీడటం లేదు. పదేళ్లుగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడానికి కారణమేంటి? హెడ్ ఆఫీస్ వైజాగ్ లో ఉందని చెబుతున్న యాజమాన్యం, స్థానిక అనుమతుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహించింది? మంగళవారం సమర్పించే పత్రాల్లోనైనా అసలు నిజాలు బయటపడతాయా? లేదా కాలయాపన చేసే ప్రయత్నం చేస్తారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ పరిశ్రమపై సమగ్ర విచారణ జరిపి, తప్పు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంలో తహశీల్దార్ తీసుకున్న చొరవను కొనసాగించి, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని ఆశిస్తున్నారు.

## గిరిజన మహిళపై దాడి దారుణం

**దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి**



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** గిరిజన మహిళపై దాడి దారుణమని దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలిలో 24వ వార్డులో గత కొన్ని రోజుల క్రితం గిరిజన మహిళ పీట సుకుమారిపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి కచేరిమిట్టలోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించి జరిగిన దాడిపై అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత దారుణమని తెలిపారు. బాదితురాలికిన్యాయం జరగే వరకు పార్టీ తరపున అండగా ఉండి పోరాడుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతల క్షీణతకు ఈ ఘటనే నిదర్శనమని తెలిపారు. ఓ మహిళపై జరిగిన దాడికి ఎమ్మెల్యే ఏమాత్రం స్పందించలేదన్నారు. ఈ కేసులో ఏ1గా చూపించాల్సిన వారిని చివరి ముద్దాయిగా చూపించడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. అన్యాయం జరిగిన బాదితురాలికి మద్దతుగా ఉండాల్సిందిపై ఆమె కొడుకుపై అక్రమ కేసులు, బూటకపు కేసును బనాయించారని పేర్కొన్నారు. వెంటనే ఈ కేసును ఉపసంహరించుకోవాలన్నారు. బాదితురాలి కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో మహిళల రక్షణపై డిప్యూటి సిఎం పవన్‌కళ్యాన్ పెద్దపెద్ద మాటలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఎస్‌టి మహిళలకు రక్షణ కరువైందని విమర్శించారు.ఈ ఘటనపై జిల్లా ఎస్‌పి సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించకపోతే వైకాపా పార్టీ అధినేత, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బాధితురాలి కుటుంబం కోసం ఎస్‌టిల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌చే పెన్నా నది దీర్ఘ కవితా సంపుటి ఆవిష్కరణ



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - కలెక్టరేట్** ఈత కోట సుబ్బారావు రచించిన పెన్నా నది దీర్ఘ కవితా సంపుటిని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆవిష్క రించారు. సోమవారం కలెక్టర్ బంగాళా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెన్నా నదికి విశిష్టమైన చరిత్ర ఉందని చాలా తెలు సుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట మరియు చారిత్రక అంశాలను ముందు తరానికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కవి ఈతకోట సుబ్బారావుని శాలువా కప్పి సన్మానించారు. రచయి తలు కవులు దంపూరి రామకృష్ణ అవ్వారు శ్రీధర్ బాబు అన్నం శివకృష్ణ డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌లు పాల్గొన్నారు.

## ఫోటోలు తొలగించడం అన్యాయం



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - కలెక్టరేట్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు చిత్రపటాలను ప్రభుత్వ కార్యాలయంలో నుంచి తొలగించడం సమంజసం కాదని జిల్లా దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తిల దినంలో డిఆర్‌ఓ విజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో దంపు రూములలో చిత్రపటాలు పడవేసి ఉన్నారన్నారు చిత్ర పటాలను తొలగించమని జీవో నెంబర్ 16 తీసుకొని రావడం ఎంత వరకు న్యాయమన్నారు. మీరు బొమ్మలు పెట్టుకోవడానికి దేశ నాయకుల పటాలను కార్యాలయంలో తొలగించడం తప్పు కదా అన్నారు. తక్షణం వాటిని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, లక్ష్మీనరసయ్య, ఇమ్మానియేల్, ఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## యువత కేశవుల్ని ఆదర్శంగా తీసుకోవాలి



**కలువాయి జూన్ 29 ప్రభాతవార్త** నేటి యువత అనకర్ల కేశవుల్ని ఆదర్శంగా తీసుకొని పోలీస్ శాఖలో చేరాలని కలువాయి ఎస్ఐ కోటయ్య తెలిపారు. బలిమెల నక్సలైట్ల కాల్పులలో అమరుడైన అనకర్ల కేశవులు 16 వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కేశవులు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరులు స్థూపం వద్ద కేశవులు చిత్రపటానికి పోలీస్ సిబ్బందితోపాటు కేశవులు కుటుంబసభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటయ్య మాట్లాడుతు పోలీస్ శాఖలో అతి చిన్న వయస్సులోనే నక్సలేట్ల కాల్పులలో అమరుడైన కేశవులు గురించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వారి తల్లిదండ్రులు చెన్నయ్య, పెంచలమ్మ, బిటిఎ నాయకులు, పెంచలరావు, సిఆర్ఎంటి, నాగేశ్వరరావు, రమేష్ పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సహకార వారోత్సవాలు



ఇందుకూరుపేట, జూన్ 29, ప్రభాతవార్త మండలంలోని నిడుముసలి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) వారోత్సవాలు సోమవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఏసీఎస్ అధ్యక్షులు వినిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేటి (జూన్ 29) నుండి జూలై 6వ తేదీ వరకు ఈ సహకార వారోత్సవాలు నిడుముసలిలో వైభవంగా జరుగుతాయని తెలిపారు. సహకార సంఘాల ప్రాముఖ్యతను, రైతులకు అందుతున్న సేవలను ఈ వారోత్సవాల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి. పార్వతి, ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి. శ్రీనివాసులు, సీఈవో ప్రతాపరెడ్డితో పాటు సహకార సంఘ సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వద్దు.. ఎస్ఐఆర్ ప్రక్రియ సర్వే వేగవంతం చేయండి!

### తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త:** మండలంలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పిజిఆర్ఎస్)ను వేదికగా మలుచుకోవాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**త్వరలో పరిష్కారం:** ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భూమి విస్తీర్ణానికి సంబంధించిన సర్వే కోసం అందిన రెండు విన్నపాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు, ఇతర పౌర సమస్యలకు సంబంధించి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమీక్ష:** అనంతరం, మండలంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఆమె సూపర్వైజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎస్ ఐ ఆర్ పనులు మందకొడిగా సాగుతున్నాయని గుర్తించిన ఆమె, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ బృందాలు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో మొత్తం 7 అర్జీలు



**విడవలూరు, జూన్ 29 ప్రభా తవార్త:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో స్థానిక ప్రజల నుంచి మూడు అర్జీలుఅందాయి. అలాగే, నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ ఎస్‌లో విడవలూరు మండలానికి సంబంధించిన నాలుగు అర్జీలు అందినట్లు తహశీల్దార్ ఏ.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలా నికి సంబంధించిన మొత్తం ఏడు అర్జీలను సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిశీలించి, నిబంధనల మేరకు గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం

: ఊటుకూరులో వైసీపీ పరివేక్షణ కమిటీ అవగాహన సమావేశం



**విడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు మండ లంలోని ఊటుకూరు పెద్దపాలెం గ్రామా లలో సోమవారం వైసీపీ పరివేక్షణ కమిటీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ స్థానిక నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌ఏలు చురుకుగా వ్యవ హరించాలని, ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించి సవరణ ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కమిటీ సభ్యులు కొట్టె మల్లికార్జునరావు, కోడూరు మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, సాగర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మహేష్, అమరనాథ్ రెడ్డి, కొండూరు శ్రీనివాసులు, వెంకటరమణతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో ఆయుష్ శాఖ ప్రత్యేక వైద్య సేవలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 29, ప్రభాతవార్త** జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరం రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. రొట్టెల పండుగ సందర్భంగా ఆయుష్, యునాని, హోమియోపతి వైద్య సేవలను ప్రత్యేక స్టాల్ ద్వారా అందిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన రొట్టెల పండుగ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిరోజూ సుమారు వెయ్యి మందికి పైగా భక్తులకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందజేస్తున్నారు. సుదూర ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు కడుపునొప్పి, అజీర్తి, జ్వరం, ఒళ్లు నొప్పులు, తల తిరగడం వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు తక్షణ చికిత్స అందించి ఉపశమనం కలిగిస్తున్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్లు సరళ హెబ్సిబా, ముదిగొండ శ్రీనివాసరాజు, జ్ఞాన ప్రసూన, వినోద్ బాబు, సుధారాణి, జాకీరుద్దీన్, హరిత, అబ్దుల్ రజాక్, కోమలి తదితరులు సేవలందిస్తూ భక్తుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. రొట్టెల పండుగ ముగిసే వరకు ఈ వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు జిల్లా ఆయుష్ శాఖ అధికారులు తెలిపారు.

## పటిష్ట భద్రత చర్యల నడుమ ఘనంగా నాలుగో రోజు రొట్టెల పండగ





**నెల్లూరు క్రైమ్, జూన్ 29, ప్రభాతవార్త :** నెల్లూరు ఘాట్ మొత్తం భక్తి పారవశ్యంలో మునిగి తేలుతోంది. బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ నాలుగో రోజుకి వచ్చేసరికి దాదాపు రెండు లక్షల మంది భక్తులు పుణ్యస్నానం, దర్గా దర్శనం కోసం తరలి వచ్చారు. అంత పెద్ద జనసంద్రాన్ని చూసి పోలీస్ యంత్రాంగం ముందే అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ ఆజిత వేజెండ్ల ఆదేశాలతో, అదనపు ఎస్పీ సిహెచ్ సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్ష స్వయంగా భద్రత చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎటు చూసినా పోలీస్ సిబ్బంది. క్యూ లైన్లు క్రమపద్ధతిలో నడిచేలా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, రద్దీని స్మూత్‌గా కంట్రోల్ చేస్తున్నారు. భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చూసేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే సమీక్షలు చేస్తున్నారు. ఈ రద్దీలో అందరికంటే ఆందోళన చిన్నారులదే కదా. అందుకే పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. తప్పిపోయిన 109 మంది చిన్నారులను వెంటనే గుర్తించి తల్లిదండ్రుల చేతిలో సురక్షితంగా పెట్టారు. ఇంకా 430 మంది పిల్లలకు ఆర్ఎఫ్ఐడి ట్యాగులు వేసి టెక్నాలజీతో కాపలా కాస్తున్నారు. పిల్లలు కనిపించకపోయినా ట్యాగ్‌తో వెంటనే ట్రేస్ చేసే వీలు కల్పించారు. దొంగలు, పిక్‌పాకెటర్లు ఈ రద్దీని అలుసుగా తీసుకోకుండా క్రైమ్ కంట్రోల్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. ఫలితంగా ఇప్పటివరకు 8 సెల్‌ఫోన్లు, 38 వేల రూపాయల నగదును భక్తులకు తిరిగి ఇచ్చారు. పిక్‌పాకెటింగ్ చేస్తున్న ఒక పాత నేరస్తురాలిని కూడా దర్గా మిట్ట పిఎస్‌కి తరలించారు. డాగ్ స్క్వాడ్స్ పనిచేస్తూ, బీఆర్ టీమ్స్ అనుమానాస్పద వస్తువుల కోసం చెక్ చేస్తూ, అన్ని బృందాలు 24/7 అప్రమత్తంగా ఉన్నాయి. లక్షల మంది మధ్య కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటన లేకుండా పండుగ ప్రశాంతంగా సాగుతుండటంతో భక్తులు పోలీసుల కృషిని మనస్ఫూర్తిగా మెచ్చుకుంటున్నారు. మొత్తానికి రొట్టెల పండుగ అంటే భక్తి ఒక్కటే కాదు, భద్రత కూడా ఎంత ముఖ్యమో నెల్లూరు పోలీస్ చూపిస్తోంది.

## ఫిర్యాదులు స్వీకరించిన పోలీసు ఉన్నతాధికారులు



**నెల్లూరు క్రైమ్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సిహెచ్ సౌజన్య తదితర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 69 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. విడవలూరు పోలీస్ స్టేషన్ పరిధి, తన తల్లి ఇటీవల మరణించినట్టు ఆ విషయమై విడవలూరు స్టేషన్ నందు అనుమానాస్పద మృతిగా కేసు నమోదైనట్టు, దానిని లోతుగా విచారించి మరణానికి కారణమైన వారిపై చర్యల కొరకు పిర్యాదు చేశారు. బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ పరిధి, తన మైనర్ కుమార్తె ఈనెల 14వ తేది నుంచి కనిపించడం లేదని బుచ్చి స్టేషన్‌లో ఈ విషయమై కేసు నమోదైనట్టు త్వరితగతిన విచారించి న్యాయం చేయమని పిర్యాది కొరారు. కోవూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన పిర్యాది, తన భర్త అత్తమామలు తనని వేదిస్తునట్టు తన భర్త వివాహేతర సంబందాలు పెట్టికొని తనను బాధలకు గురిచేస్తున్నట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. పిజిఆర్ఎస్ నందు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సీఐ రామారావు, డబ్ల్యుపిఎస్ సీఐ సుబ్బారావు, ఎస్‌బి 2 సీఐ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నంది సేవలో ఆదిదేవుడు





**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు నందిసేవ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కోవూరు ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు. అనంతరం స్వామివారు కోవూరు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరి కృష్ణప్రసాద్, రుత్వికులు కృష్ణస్వామి, సుబ్బయ్య స్వామి, మురళి స్వామి, నిరంజన్ స్వామి, ఉన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రొట్టెల పండుగ భక్తులకు వైద్య సేవలు



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ మస్తానయ్య ఆదేశాల మేరకు బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు విశిష్ట సేవలు అందిస్తున్నారు. ఈనెల 26 నుండి 30వ తారీకు వరకు జరుగుతున్న రొట్టెల పండుగలో 24 గంటలు ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో పాటు మందులు, అంబులెన్స్, వీల్ చైర్ ఏర్పాటు, చేయడం, ఆపదలో ఉన్న భక్తులకు ప్రథమ చికిత్స అందించడం జరిగింది. ఎమర్జెన్సీ కేసులు జిజిహెచ్‌కి తరలిస్తున్నామని రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ డాక్టర్ ఏవి సుబ్రహ్మణ్యం తెలిపారు. రొట్టెలు మార్చుకునే క్రమంలో ఎవరైనా చిన్నచిన్న గాయాలైన వారికి ఫస్టేట్ అందించి కట్లు కట్టడం, తప్పిపోయిన పిల్లలను గుర్తించి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు పంపించడం, ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురైన భక్తులను గమనించి వారికి ఓఆర్ఎస్ ద్రావకం తాగించి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో గ్రామీణ వైద్యులు సేవలందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సుందరరాజు, సూపర్వైజర్ జాకబ్, జిల్లా గ్రామీణ వైద్య నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, కె. రవీంద్రబాబు, రోజా రాణి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మామిడి, పొగాకు ధరలు పతనం

- ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీమ్ ద్వారా రైతాంగని ఆదుకోవాలి

- బిజెపి నేత మిడతల రమేష్



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - కలెక్టరేట్** నెల్లూరు జిల్లాలో 25 వేల ఎకరాలలో మామిడి 45వేల ఎకరాలలో పొగాకు సాగు చేశారు.. అంతర్జాతీయ పరిణామాలతోను, పరిశ్రమలు మామిడి ఉత్పత్తుల కొనుగోలు తగ్గించడం వలన మామిడి ధరలు పతనమయ్యాయని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నీ తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో వీఆర్వో విజయ్ కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇదే సమయానికి మామిడి కేజీ 75 రూపాయలు అమ్మగా ప్రస్తుతం వంద రూపాయలకు నాలుగు ఐదు కేజీలు అమ్ముతున్నారు. గత డిసెంబర్‌లో వచ్చిన వాన వలన ఎకరాకి ఆరు టన్నుల మామిడి దిగుబడి రావాల్సి ఉంటే ఎకరాకు ఒక టన్ను మాత్రమే దిగుబడి వచ్చింది. మామిడి సాగులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 10 లక్షల ఎకరాలలో మామిడి సాగు ధరలు పతనం అయ్యాయి. జిల్లాలో 45000 ఎకరాలలో పొగాకు పండించిన రైతులకు మద్దతు ధర లభించలేదు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేజీ పొగాకు 200 రూపాయలకు తక్కువ కాకుండా కొనుగోలు కేంద్రాలలో కేజీ పొగాకు 200 రూపాయలకు తగ్గకుండా కొనుగోలు జరగాలని ఆదేశించారు. అయినప్పటికీ సగటున 160 రూపాయలు వంతెన కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లాలో 3600 పొగాకు బేరన్‌లు ఉండగా 4000 కుటుంబాలకు పొగాకు జీవనాధారంగా ఉంది. మామిడి పొగాకు రైతులను రైతాంగం ఆర్థికంగా ఆదుకోవాలని రమేష్ ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి చిట్టిబాబు ఆదినారాయణ అల్లూరు నాగేంద్ర సింగ్ ఏవీ సుబ్బయ్య ముజీబ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## దర్గా వద్ద అగ్నిమాపక శాఖ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

- భక్తుల భద్రతపై అధికారుల సూచనలతో కూడిన ఆదేశాలు



**నెల్లూరు క్రైం, జూన్ 29, ప్రభాతవార్త:** నెల్లూరులోని ప్రసిద్ధ బారా షాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. సోమవారం రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ డి. మురళీ మోహన్ దర్గా ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. తనిఖీ సందర్భంగా ఆయన జిల్లా అధికారులకు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమయంలో ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు ఎటువంటి ఆటంకం లేకుండా ఘటనా స్థలానికి చేరుకోవడానికి వీలుగా, దారిలో ఉన్న చిన్న చిన్న తోపుడు బండ్లను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా క్లియరెన్స్ ఇవ్వడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు. భద్రత కోసం అత్యాధునిక ఏర్పాట్లు చేసామన్నారు. విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి దాదాపు 125 మంది సిబ్బందిని ఈ విధుల్లో నిమగ్నం చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తులు పొరపాటున లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా, అల్లరి మూకలు నీటిలోకి రాకుండా స్వర్ణల చెరువులో ప్రత్యేకంగా రెండు రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఫైర్ పోర్టబుల్ పంప్స్ సహాయంతో 24 గంటల షిఫ్టుల వారీగా ఘాట్‌లను శుభ్రం చేస్తున్నట్లు, ప్రమాదాలు జరిగితే నిమిషాల్లో స్పందించేలా నాలుగు ఫైర్ ఇంజిన్లను వ్యూహాత్మక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచిన్నట్లు వివరించారు. దర్గా లోపల, బయట, జెయింట్ వీల్స్, ఎలక్ట్రికల్ పాయింట్లు, జెనరేటర్ల వద్ద ప్రత్యేక అగ్నిమాపక బృందాలను ఉంచామని, ఘాట్ వద్ద ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఫైర్ బుల్లెట్ తదితర అత్యాధునిక రెస్క్యూ పరికరాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో సిబ్బంది వేగంగా స్పందించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. భారీ ఎత్తున వస్తున్న భక్తులకు ఎటువంటి అభద్రత భావం కలగకుండా చేయడంలో తమ సిబ్బంది విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మర్డర్ కేసులో ముద్దాయి అరెస్టు



**ఉదయగిరి, జూన్ 29, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి పోలీసు స్టేషన్ నందు సోమవారం సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో మర్డర్ కేసులో ముద్దాయి అరెస్టుపై విలేకర్ల సమావేశంజరిగింది. వింజమూరు జాతీయ రహదారి ఫారెస్టు పొలంలో ఇటీవల అనుమానస్పదంగా గోనె సంచిలో దొరికిన మృతదేహం కేసును ఉదయగిరి సీఐ వెంకటరావు చేధించారు. మృతుడు వింజమూరు మండలం ఊటుకూరుకు చెందిన దేవరకొండ గోవిందులుగా ఆయన వయసు 45 సంవత్సరాలు ఉంటాయని అన్నారు. ఆయన మృతికి కారణమైన వ్యక్తి ఉదయగిరి మండలం దాసరపల్లి గ్రామానికి చెందిన షేక్ జలీల్ అని తెలిపారు. అతనికి ఊటుకూరు సమీపంలో నిమ్మ తోటలో కూలిగా పోయేవాడు మృతి చెందిన వ్యక్తికి జలీల్‌కి మధ్య ఆర్థిక లావాదేవీల కారణమని స్పష్టం చేసిన సీఐ వెంకటరావు గత రెండు రోజుల నుంచి వాగ్వివాదం జరిగిందని తెలిపారు. అలాగే మృతి చెందిన రోజు సద్ది అన్నం తిన్న తర్వాత వింజమూరు పోయివస్తానని చెప్పి వెళ్లారు. ఎంత సేపు చూసినా రాలేదు గోవిందులు. ఆర్థికలావాదేవీలు ఉంటే ఎంతకు తెగిస్తున్నారో మీరే చూడండి తస్మాత్ జాగ్రత్త.

## జూలై 1న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- సత్యవేడులో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

- చిల్లకూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయనున్న సీఎం



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - కలెక్టరేట్** ప్రముఖ ద్విచక్ర వా హన తయారీ సంస్థ హీరో మోటార్స్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ జీపీ సీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1 తేదీన శంకు స్థాపన చేయనున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని మదనపాలెంలో హీరో మోటార్ కార్ప్స్ నూతనంగా ఏర్పాటు చేయనున్న జీపీసీకు సీఎం భూమిపూజ చేయనున్నారు. హీరో మోటార్స్‌కు చెందిన వివిధ తయారీ కేంద్రాలు, డీలర్లకు ద్విచక్ర వాహనాల విడి భాగాలను తయారు చేసి సరఫరా చేసేలా ఆ సంస్థ ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటార్ కార్పొరేషన్ ఈ జీపీసీ 2.0ను నిర్మించనుంది. దీని ద్వారా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే శ్రీసిటీ సమీపంలో హీరో మోటార్స్ సంస్థ ఏర్పాటు చేసిన అధునాతన ద్విచక్ర వాహనాల తయారీ ప్లాంట్ లో ఏడాదికి 1.5 మిలియన్ల వాహనాలను ఉత్పత్తి జరుగుతోంది. దేశ, విదేశాల్లో ఉన్న మోటార్ సైకిళ్లు, స్కూటెక్‌లు, ఈవీలకు విడి భాగాలను తయారు చేసేందుకు గానూ ఈ జీపీసీను హీరో మోటార్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా ఉన్న హీరో మోటార్స్ సంస్థ పలువురికి స్కాలర్ షిప్ లను ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా హీరో మోటార్స్ అందించనున్న బ్రిజ్ మోహన్ లాల్ ముంజల్ పేరుతో హీరోస్ ఆఫ్ టుమారో పేరిట స్కాలర్‌షిప్‌లను సీఎం ఆవిష్కరించనున్నారు. ఏపీ పోలీసులు వినియోగించుకునేలా హీరో మోటార్స్ సంస్థ ప్రత్యేకంగా తయారు చేసిన ఎలక్ట్రిక్ మొబిలిటీ వాహనాలను కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించనున్నారు.

**పేదల సేవలో సీఎం** నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంట్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయనున్నారు. వృద్ధాప్య, వితంతు సహా వేర్వేరు కేటగిరీలకు చెందిన 62 లక్షల మంది లబ్దిదారులకు రూ.2750 కోట్ల మేర పెన్షన్‌ను అందించనున్నారు. పున్నపువారిపాలెం గ్రామంలో ఓ లబ్దిదారు ఇంటికి వెళ్లనున్న ముఖ్యమంత్రి స్వయంగా పెన్షన్ ను పంపిణీ చేయనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం పాల్గొననున్నారు. రాత్రికి శ్రీసిటీలో ఉన్న అతిథి గృహంలో ముఖ్యమంత్రి బస చేయనున్నారు.

## టీడీపీలోకి భారీ సంఖ్యలో మత్స్యకారులు

- ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని ఆదాలనగర్‌కు చెందిన 50 వైసీపీ కుటుంబాలు చేరిక



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** మత్స్యకార కాపులు కొమారి తిరుపతయ్య, ఆవుల శ్రీనివాసులు మునిరాజాతో పాటు వైసీపీ సీనియర్ నేత కొమారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేరిన కడలి పుత్రులకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి టీడీపీలోకి ఆత్మీయ ఆహ్వానం పలికారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలు రికార్డు స్థాయిలో అమలవుతున్నాయని సోమిరెడ్డి తెలిపారు. మత్స్యకారులకు వేట విరామ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు గుర్తు చేసారు. మత్స్యకారులకు ఎప్పుడూ టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలో ప్రళయకావేరి, మునితాత, కృష్ణ, మేకల రాజా, కొండూరు మస్తానయ్య, షేక్ వాహబ్ పాషా, షేక్ బాషా, వాయిల సోమయ్య, ఆనీఫ్, ఆవుల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చి రూరల్ బ్యాంకులో సహకార సంఘ వారోత్సవాలు ప్రారంభం




**బుచ్చి జూన్ 29 ప్రభాతవార్త** బుచ్చి రెడ్డిపాళెం రూరల్ బ్యాంకులో సహకార సంఘ వారోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. డిసిఒ గురప్ప, బ్యాంకు అధ్యక్షులు యేటూరు శివరామకృష్ణారెడ్డి ,మొదట రైతులకు ఏరువాక శుభాకాంక్షలుతెలిపారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఏరువాక శుభాకంక్షలు తెలియ జేశారు. డిసిఒ గురప్ప,డిఎల్‌సిఒ సుబాషిణి అధ్యక్షులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి జెండాను ఎగుర వేశా రు ఈ సందర్భంగా బి గురప్ప మాట్లాడుతు కేంద్ర ప్ర భుత్వ సహకార మంత్రిత్వ శాఖ గత ఐదు సంవత్సరాలలో చేపట్టిన సంస్కరణలు, రైతు సంక్షేమ కార్యక్ర మాలపై వివరించారు. అందరు కలిసి ప్రతిజ్ఞ చేశారు. రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎరువుల యాజమాన్యంపై నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లోకనాద్‌రెడ్డి అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు మాచవరం శ్రీనివాసులు, కోనం క్రిష్ణయ్య, సిఇఒ అశోక్, సురేష్‌రెడ్డి,కృష్ణారెడ్డి రైతులు పాల్గొన్నారు.

## జలాశయంలో చేపలవేట నిషేధం



**అనంతసాగరం ,జూన్29,ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయంలో చేపల వేటను నిషేధిస్తూ మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. సోమ వారం సోమశిలలో మత్స శాఖ అభి. వృద్ధి అధికారి జి.సుధీర్ మత్సకారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయంలో చేపలవేటను రెండు నెలలపాటు పూర్తినిషేధించడం జరిగిందన్నారు. చేపల సంతానోత్పత్తికాలంలో వాటి వృద్ధికి ఆటంకం కలుగకుండా ఉండేందుకు , జలాశయంలో మత్స్య సంపదను కాపాడేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జులై 1నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈనిషేధం అమలులో ఉంటుందన్నారు. నిషేధ ఆజ్ఞలను ధిక్కరించి జలాశయంలో చేపలవేట సాగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి : శేషం సుదర్శన్



**మర్రిపాడు, జూన్29,ప్రభాతవార్త:** కావలి పట్టణం కచేరిమిట్టలో గిరిజన మహిళను వివస్త్రను చేసి పాశవికంగా దాడిచేసిన ఘటనను జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ ఒక ప్రకటనలో ఖండించారు. సభ్య సమాజం తలదించుకునే ఈ దారుణాన్ని రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. నేటి యుగంలో అన్ని రంగాల్లో ముందుకు వచ్చి సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్న మహిళలకు ఈ సమాజంలో ఇలాంటి దుర్గాగ్రం జరగడం అత్యంత హేయనీయమన్నారు. మహిళలకు అండగా ఉంటామనే అధికారపార్టీ నేతలు నిందితులపై కఠినసెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు వేసి బాధితురాలివైపు నిలబడాలని డిమాండ్ చేశారు. ఒక మహిళ రాష్ట్రపతిగా ఉన్న దేశంలో ఒక మహిళ హోంమంత్రిగా ఉన్న రాష్ట్రంలో దారుణం జరగడం అత్యంత హేయనీయమన్నారు. కావలి ఘటన చూస్తే మణిపూర్‌లో కొంతమంది మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన గుర్తొస్తుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసి బాధితురాలికి భరోసా ఇవ్వాలని కోరారు. నిందులు ఏరాజకీయపార్టీకి చెందిన వారైనా కఠినచర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆయన కోరారు.

## సీఎం ప్రోగ్రాంకి తరలిన అధికార యంత్రాంగం

**కోట, జూన్ 29 ప్రభాతవార్త** చిల్లకూరు మండలం పునపరివారిపాళెంలో జూలై 1న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేస్తున్నారు. ఆ రోజున ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపిడిఒ దిలీప్‌కుమార్, వివిధ శాఖల అధికారులు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఇప్పటికే జిల్లా యంత్రాంగమంతా సీఎం ప్రోగ్రాంలో బిజీబిజీగా గడుపుతున్నారు. వేలమంది ప్రజలు హాజరయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో వారి కోసం సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, టాయిలెట్, తాగునీరు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, సభా వేదిక వద్ద నిరంతర విద్యుత్, మెడికల్ క్యాంప్‌లు, తదితర ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించినట్లు తెలుస్తోంది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు.

## డిగ్రీ కళాశాలను ఎప్పటికీ మర్చిపోలేను : మాజీ జేసీ ముద్దపాటి సూర్యనారాయణ



**విడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త:**"పుట్టిన గ్రామంలో ఎన్నో కష్టాలను అధిగమించి, నాకు ఉన్నత చదువులను ప్రసాదించిన ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎప్పటికీ మర్చిపోలేను" అని జిల్లా మాజీ జాయింట్ కలెక్టర్ ముద్దపాటి సూర్యనారాయణ భావోద్వేగంతో పేర్కొన్నారు. విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నారాయణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన కుమా రుడు డాక్టర్ సురేంద్రనాథ్, కోడలు డాక్టర్ హి మబిందుల వివాహ వేడుకను పురస్కరిం చుకుని, సామాజిక బాధ్యతగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడ మే మా ఉద్దేశం. దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, మెరుగైన వైద్యం అవసరమైన వారికి నారాయణ హాస్పిటల్లో ఉచితంగా చికిత్స చేయిస్తాం" అని స్పష్టం చేశారు. శిబిరంలో దంత వైద్య నిపుణుల బృందం స్థానిక ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత, వైస్ ప్రిన్సిపల్ మధుసూదన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దీనదయాల్, అధ్యాపకులు,నారాయణ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కైలాసం ఆదిశేషారెడ్డిని పరామర్శించిన చేజర్ల



**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇందుకూరుపేట మాజీ జెడ్పిటీసీ సభ్యులు, టీడీపీ సీనియర్ నాయకుడు కైలాసం ఆదిశేషారెడ్డి మాతృమూర్తి ఇటీవల శివవైక్యం చెందారు. ఈ మేరకు సోమవారం ఆయన కుటుంబ సభ్యులను జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముదిరాజ్ సాధికార సమితి కన్వీనర్ పీఎల్ రావు, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ఎస్‌కే రసూల్, తదితరులు ఉన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ మరింత వేగవంతం కావాలి



**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలో మూడవ గ్రామ సచివాలయంలో జరుగుతున్న డిటిజిలైజేషన్ ప్రక్రియను సోమవారం ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేసేలా బీఎల్‌వోలు తగు చొరవ తీసుకోవా లన్నారు. ఈ పరిశీలనలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, బీఎల్‌వోలు ఉన్నారు.

టోనెంబరు:29కవిఅం9 125 కిలోల పండ్ల రసాలతో అభిషేకం

## 125 కిలోల పండ్ల రసాలతో అభిషేకం



**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలోబ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో కొలువై ఉన్న ఆది శంకరునికి భక్తుల సహకారంతో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో125 కిలోల మామిడి పండ్ల రసాలతో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆలయ కార్యదర్శి ఎస్. రమేష్‌బాబు కుటుంబ సభ్యులు వ్యవహరించారు,చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులుపాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరి కృష్ణప్రసాద్, రుత్వికులు కృష్ణస్వామి, సుబ్బయ్య స్వామి, మురళి స్వామి, నిరంజన్ స్వామి, భక్తులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా సవరణపై తహశీల్దార్ ఆరా



**విడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తహశీల్దార్ ఏ.లక్ష్మీ ప్రసన్న క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆమె స్వయంగా పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు, సవరణ పనుల తీరుపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**అసంతృప్తి వద్దు.. పారదర్శకత ముద్దు** ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి తప్పులకు తావులేకుండా డేటా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

**– అర్హులందరికీ ఓటు** అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఫారాల పంపిణీ, క్షేత్రస్థాయి తనిఖీలను వేగవంతం చేయాలని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సలాం, బీఎల్వోలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి పూడిపర్తి విద్యార్థులు



**వెంకటాచలం జూన్ 29 ప్రభాతవార్త** పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వెంకటాచలం మండలం పూడిపర్తి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు కె.జస్వంత్(591), కె.చందన(589), కె.సుశ్వాని(587) నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేద కుటుంబాల నుంచి వచ్చి అత్యుత్తమ మార్కులతో సత్తాచాటడంపై సంతోషం వ్యక్తం చేసిన సోమిరెడ్డి ట్రిపుల్ ఐటీలో క్రమశిక్షణతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష.

## కసుమూరులో భక్తుల కోలాహలం

### దేశ నలుమూలల నుంచి భక్తుల రాక



**వెంకటాచలం జూన్ 29 ప్రభాతవార్త** ప్రముఖ ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వల్లి దర్గాలో భక్తుల కోలాహలం నడుమ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నెల్లూరు బారసాహి దర్గా వద్ద జరిగే రొట్టెల పండగకు వచ్చే భక్తులు దర్గాని దర్శించుకొని కసుమూరుకు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా దర్గాకమిటీ ఈవో అందరు కలిసి ఏర్పాట్లు చేశారు. తాగునీరు మరు గుదొడ్లు వసతి సౌక ర్యాలు తదితర వాటిపై భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుస్తుగా ఏర్పాట్లుచేశారు. సోమవారం వెంకటాచలం నుంచి కసుమూరు వరకు దారి పొడుగునా వాహ నాలు నిలిచిపోయినాయి ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్న అక్కడ అధిక సంఖ్యలో వాహనాలు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నెల్లూరు రోలర్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐ సురేంద్రబాబు ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కస్మూర్ సామాజిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు కొంతమంది భక్తుల కోసం తాగునీరు అన్నదానాలు ఏర్పాటు చేశారు.

## మహిళపై దాడి చేసిన నిందుతులను అరెస్టు చేయాలి



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** కావలి కచేరి మిట్టలో మహిళపై దాడిచేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని వామపక్ష నేతలు కోరారు. బాధితురాలిని సోమవారం వామపక్ష పార్టీ నేతలు పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరసా ఇచ్చారు. వామపక్ష నేతలు మాట్లాడుతూ మహిళపై విచక్షణ రహితంగా దాడిచేస్తే కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిందితులను కాపాడడానికి ప్రయత్నించారని ఆరోపణ చేశారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని ఉపన్యాసాలు చేస్తున్న కూటమి పార్టీ నేతలే మహిళలపై దాడి చేసి, కొడుకును కూడా కొట్టడం దారుణం అన్నారు. దాడి జరిగిన తరువాత కేసును నీరుగార్చేందుకు రక రకాల ప్రయత్నాలు చేయడాన్ని తప్పుపట్టారు. తక్షణమే మహిళపై దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాధిత మహిళను కలిసిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, న్యాయవాది కరవది భాస్కర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజులు కలరు.

## సర్వాయిపాలెం గిరిజన కాలనీలో పేదలకు అన్నదానం



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** సంయుక్త సేవాసంస్థ అధ్యక్షులు సురేంద్ర ఆధ్వర్యంలో నెల్లూరు పట్టణం నివాసులు, సంయుక్త సేవా సంస్థ సభ్యులైన కె.శ్రీనివాసరావుకి భార్య, కుమారులైన కె.సాయి చైతన్యకు అమ్మ, తమ్ముడైన స్వర్గీయ ఎస్‌సి లలిత, కుమారుడు స్వర్గీయ జె.సాయిరాంబావన్‌ల జ్ఞాపకార్థంగా పట్టణ పరిసర ప్రాంతమైన సర్వాయిపాలెం గిరిజన ప్రాంతంలోని పేదలకు బిర్యాన్ని , అరటిపండ్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ దాతలు శ్రీనివాసరావు సాయిచైతన్యలు వారికిదూరమైన లలిత కుమారుడు జైసాయిరాం బావన్‌ల పేర్లు మీద ప్రతి నెలా పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. సంయుక్త సేవాసంస్థలోని పేదలకు ఆకలి తీర్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌సి లలిత వారి కుమారుడు జైసాయిరాం భావన్‌ల పవిత్ర ఆత్మకు శాతంతి కలగాలని కోరారు.

## నివాసాల మధ్య మిల్లర్‌ను తొలగించాలి



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** బాపూజీ నగర్‌లో ఉన్న ఇళ్ళ మధ్య కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిన స్థలంలో ఇటీవల ఓ కాంట్రాక్టర్ తన మిల్లర్‌ను తెచ్చి దీంతోపాటు కంకర్‌ను తోలుతున్నాడని అక్కడ ఆయన కాంట్రాక్టు పనులు చేసుకునేందుకు పూను కొన్నాడని తక్షణం నివాసాల మధ్య పెట్టిన మిల్లర్‌ను కంకరను తొలగించాలని కోరుతూ బాపూజీ నగర్ వాసులు సోమవారం ఆర్డీఓ ఎలీషా కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న తమ నివాసాల మధ్య మిల్లర్లు పెట్టి శబ్దం కాలుష్యంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రశాంతంగా ఉన్న ఇళ్ళమధ్య పెట్టిన మిల్లర్ మిషన్‌ను తీసివేయించాలని కోరారు. దీనికి ఆర్డీఓ స్పందిస్తూ తాను మున్సిపల్ కమిషనర్‌తో చెప్పిబాధితుల సమస్యను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాపూజి నగర్‌వాసులు బీవి.లక్ష్మణరావు, వి.పెంచలరెడ్డి, బి.జయరామిరెడ్డి, జి.వెంకటయ్య, వి.వెంకట ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి




**కావలి, జూన్ 29 ప్రభాతవార్త** :ఏపీ మున్సిపల్ వర్కర్స్ సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ ఎలీషాబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు చేపడుతామన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరిని పర్మనెంట్ చేయాలని, బెనిపిట్స్ ఇవ్వాలని 60ఏళ్ళ పేరుతో తొలగించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరిని ఉద్యోగం కల్పించాలని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పొలయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె.బాబు, ఎన్.క్రాంతికుమార్, రమేష్, శీనయ్య, మహిళా నాయకులు జ్యోతి, అలేఖ్యతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిగారు మా బిడ్డను కాపాడండి




**బుచ్చి జూన్ 29 ప్రభాతవార్త** పిలిపిన్స్‌లో ఇరుకున్న తమ కుమారుడు బరిగల ప్రేమ్ చెందను ఇండియాకు తీసుకొని రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు తమని కాపాడాలని బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన బరిగల వెంకటేశ్వర్లు విలేఖర్ల సమావేశంలో కన్నీటి పర్యంతమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 2023లో ఎంబిబిఎస్ చదివించడానికి సింహపురి ఎడ్యుకేషల్ కన్సల్టెన్సీని కలివడం జరిగిందని ఆయన తెలిపారు. కన్సల్టెన్సీ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డికి అప్పుచేసి 15 లక్షల రూపాయాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. అతను కాలేజికి కేవలం 40 వేలు రూపాయాలు కట్టడంతో అక్కడ మాకుమారుడుకి వీసా రెన్యువల్ చేయలేదని ఆయన వాపోయారు. వీసా లేకపోవడంతో అనధికారికంగా ఉంటున్న తమ కుమారుడ్ని పిలిపిన్స్‌లో ఏ క్షణమైన అరెస్టు చేసే అవకాశం ఉంది అని వెంకటేశ్వర్లు వాపోయాడు. తాను బేల్దారి పను చేసుకుంటు జీవనం సాగిస్తున్నాను అని నాకు ఆరోగ్యం బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాకొడుక్కికి ఏమైనా జరిగితే మరణమే శాసనం అని వాపోయాడు. తమను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తమ కుమారుడు ప్రేమ్ చంద్‌ను ఇండియాకు రప్పించడానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ,డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** మాకున్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని 24వ వార్డు కచేరి మిట్టకుచెందిన షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక షాదీమందిర్ నందు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో షర్మిల మాట్లాడుతూ మా ఇంటిపక్కన నివసిస్తున్న గిరిజన మహిళగా చెప్పుకొంటున్న కైరున్నీసా కుమారుడు సాధిక్ మా కుమార్తె స్నానం చేస్తుండగా చూస్తున్నాడని అడిగినందుకు వాదనలు జరిగిన మాట వాస్తవమని దీనిపై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయడం జరిగిందన్నారు. 24వ వార్డుకు చెందిన టిడిపి నేత ఇబ్రహీం మా మాద్య మధ్యస్తం చేసి కేసులను రాజీ చేసే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఇబ్రహీంకు ఎటువంటి సంబంధం లేదన్నారు. గిరిజన మహిళగా చెప్పుకొంటున్న కైరునిసా ఆధార్, రేషన్‌కార్డు అన్ని ఖైరున్నిసా పేరుమీద ఉన్నాయని తెలిపారు. కైరున్నిసా కుటుంబసభ్యులు తమ ముగ్గురు కుమార్తెలకు ఏ విధంగా వివాహాలు అవుతాయో చూస్తామని బెదిరండం జరిగిందన్నారు. అలాంటి వ్యక్తులకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఏ విధంగా సపోర్టు చేస్తారన్నారు. దీంతో ఇంతవరకు మేము బయటకు ఇంతవరకు రాలేదని మాపై సోషల్‌మీడియాలో ప్రచారాలు చేయడం తగదన్నారు. ఆడపిల్లలు ఉన్న మాకు సహాయం చేయాల్సింది పోయి కైరున్నీసా కుటుంబానికి అండగా ఉండడం ఏంటని ప్రశ్నించారు. 8వ వార్డు టిడిపి నేత కమర్‌బాబు మాట్లాడుతూ 24వ వార్డు టిడిపి నేత ఇబ్రహీంకు ఈ కేసుకు ఎలాంటి సంబంధం లేదని రెండు ముస్లిం కుటుంబాల మధ్య చాలా రోజులుగా జరుగుతున్న వివాదం అని తెలిపారు. దానిని సర్దుబాటు చేసేందుకు ఇబ్రహీం ఎంత కృషి చేయడం జరిగిందన్నారు. ఆ రెండు కుటుంబాలు ముస్లిం కుటుంబాలని స్పష్టంగా ఆధారాలు చెబుతున్నాయని వైసిపి రాజకీయం చేస్తుందన్నారు. పదేళ్ళ ఎమ్మెల్యేగా చేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి వాస్తవాలు గమనించకుండా గిరిజన మహిళకు అన్యాయం జరిగిందని చెప్పడం సమంజసం కాదన్నారు. ముగ్గురు ఆడపిల్లలు రోడ్డున పడుతారన్న విషయం మరిచారన్నారు. ఆడపిల్లలున్న కుటుంబానికి న్యాయం చేయకుండా వైసిపి నేతలు మాట్లాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో బీబీజాన్,మల్లిక, సిరాజ్,ముస్లిం మహిళలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహకార వారోత్సవాలు ప్రారంభం



**వింజమూరు, జూన్ 29, ప్రభాతవార్త** వింజమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ వారోత్సవాలలో భాగంగా మొదటి రోజున సహకార రచ్చబండ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఏజిఎం అహ్మద్ భాషా స్థానిక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వి. హరీష్‌లు హాజరయ్యారు ముందుగా సొసైటీ చైర్మన్‌తో కలిసి సహకార జెండాను ఎగురవేశారు. అనంతరం సహకార ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి దిగ్విజయంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా ఈ వారోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. సంఘ సేవలను కొనియాడారు ఇంతవరకు స్వల్పకాలిక రుణాల ద్వారా 6.32 కోట్లు అలాగే దీర్ఘకాలిక రుణాల ద్వారా 7.75 కోట్లు రుణాలు అందించినట్లు వారు తెలిపారు. మండలంలోని రైతులందరికీ సంఘం ద్వారా ఎరువులు అందిస్తున్నామన్నారు సంఘం ద్వారా అందించే సిఎస్‌సి సేవలను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మేకల రమణయ్య జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మద్దూరు రాజగోపాల్ రెడ్డి కరకల నాగిరెడ్డి సిబ్బంది ముక్క మల్ల శ్రీనివాస్ రెడ్డి రాధిక రైతులు తదితరులు ఉన్నారు.

## త్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందిన లోకేష్



**వింజమూరు(చాకలకొండ), జూన్ 29, ప్రభాతవార్త:** కష్టపడితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులైనా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చుని నిరూపించాడు చాకలకొండ మండల విద్యార్థి. ఈరోజు వెలువడిన ఐఐఐటి రెండో విడత కౌన్సిలింగ్ ఫలితాల్లో రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండకు చెందిన గుండ్లపల్లి లోకేష్ శ్రీకాకుళం ఆర్‌జియుకెటిలో సీటు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన లోకేష్ చిన్నప్పటి నుంచే చదువు పై ఆసక్తి చూపించేవాడు. పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకంలో, స్వీయ కృషితో ర్యాంక్ సాధించి ప్రతిష్టాత్మక త్రిబుల్ ఐటీలో సీటు దక్కించుకున్నాడు. 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో చదువుకునే అవకాశం రావడంతో లోకేష్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లోకేష్ విజయాన్ని అభినందిస్తూ ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల ల్లోనూ ప్రతిభకు కొదవలేదు. లోకేష్ మిగతా విద్యార్థులకు ఆదర్శం అని ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏ. సుభాషిని మాట్లాడుతూ లోకేష్ క్రమశిక్షణ, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించాడని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఎస్. తులసీ రామిరెడ్డిఎస్. వెంకటేష్, ఎస్. ప్రతాప్, టి. నరేష్, ఎస్. మస్తానయ్య, వార్డెన్ మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు వెలుగోటి కృష్ణ, రామిరెడ్డి, బాల సుందరం, బాయ్ పాల్గొని లోకేష్‌ను అభినందించారు. లోకేష విజయం చాకలకొండ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత చదువులు చదివించాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

## త్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందిన శ్రీ సరస్వతి విద్యార్థి



**వింజమూరు, జూన్ 29, ప్రభాతవార్త** వింజమూరు నడిమూరు నందలి శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాల విద్యార్థి కే కిరణ్ కుమార్ గత పదవ తరగతిలో 600 మార్కులకు ఐదు వందల తొంబై రెండు మార్కులు సాధించి జయ కేతనాన్ని ఎగురవేశారు. ఆ విద్యార్థి త్రిబుల్ ఐటీ కి దరఖాస్తు చేయగా ఒంగోలు త్రిబుల్ ఐటీ కళాశాల యందు ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలు అంకిరెడ్డి ఉపాధ్యాయ బృందం ఆ విద్యార్థిని నీ అభినందించారు భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకోవాలని అందుకు నిరంతర కృషి అవసరమని సూచించారు. ఈనాటి శ్రమయే రేపటి సౌఖ్యానికి నాంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

## కాకినాడ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు



**ఉదయగిరి, జూన్ 29, ప్రభాతవార్త** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపై ఉదయగిరి వైసీపీ పార్టీ శ్రేణులు సోమవారం ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలతో ఈ ఫిర్యాదు చేశామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నందుకు నానాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఉదయగిరిలోని పంచాయతీ బస్టాండ్ నుంచి పోలీసు స్టేషన్ వరకు నడుచుకుంటూ వెళ్లి అనంతరం పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉదయగిరి పట్టణ అధ్యక్షులు షేక్ దస్తగిరి అహ్మద్, వైసీపీ సీతారామపురం మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు అక్కి భాస్కర్‌రెడ్డి, బసిరెడ్డి కృష్ణారెడ్డి, సలీం, బాలినేని పెద్ద మాబయ్య, ఎస్సీ సెల్ నాయకులు గురవయ్య, పెంచలయ్య, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వెనుక కన్ను చారిణి కనిపెట్టిన భద్రతా కవచం






**వింజమూరు, జూన్ 29, ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వాటిలో ఎక్కువగా పాదచారులేబలవుతున్నారు. వెనుక నుంచి వచ్చే వాహనాలు, సైకిళ్లు, జంతువులను గమనించలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ఆలోచించిన 8వ తరగతి విద్యార్థిని సాదం చారిణిఒక అద్భుతమైన పరికరాన్ని రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల, ఆత్మకూరులో చదువుతున్న చారిణి తన గైడ్ ఉపాధ్యాయురాలు నాహిన్ సిరాజ్ సహకారంతో సేఫ్టీ గ్యాడ్జెట్ ఫర్ పెడస్ట్రియన్స్ ప్రాజెక్ట్‌ను తయారు చేసింది. తలపై పెట్టుకునే ఒక బ్యాండ్ లాంటి పరికరం ఇది. ఈ బ్యాండ్ ముందు భాగంలో చిన్న అద్దం అమర్చబడి ఉంటుంది. పాదచారి నడుస్తున్నప్పుడు ఆ అద్దంలో వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలు, బైకులు, జంతువులు కనిపిస్తాయి. దీంతో ముందుగానే అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. అంతే కాదు, రాత్రి సమయంలో నడిచే వారి కోసం ఈ బ్యాండ్‌కు ఎల్ ఈ డిలైట్ కూడా అమర్చారు. ఈ లైట్ చీకట్లో దారి చూపడమే కాకుండా, దూరం నుంచి వచ్చే వాహనదారులకు పాదచారి ఉన్న విషయాన్ని తెలియజేస్తుంది. చారిణి మాటల్లో నా చిన్నమ్మ రోడ్డు పక్కన నడుస్తుంటే వెనుక నుంచి బైక్ వచ్చి తప్పించుకుంది. ఆ రోజు నుంచే నాకు ఈ ఆలోచన వచ్చింది. మనం వెనుక చూడలేం కదా, అందుకే తలకు ఒక వెనుక కన్ను పెడితే ఎంత బాగుంటుందో అనిపించింది అని చారిణి చెప్పింది. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చారిణి ఆవిష్కరణను ఎంతో అభినందించారు. చిన్న వయసులోనే సమాజ సమస్యలపై అవగాహనతో పరిష్కారం ఆలోచించిన చారిణిని అందరూ భవిష్యత్ శాస్త్రవేత్త అని ముద్దుగా పిలుచుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ఈ చిన్న పరికరం పెద్ద మార్పు తీసుకురాగలదని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జాడ లేని చినుకు

### - హలధారిలో వణుకు- జిల్లాపై ఎల్‌నినో ప్రభావం



**కోట, జూన్ 29 ప్రభాతవార్త** భయపడినట్లే జరుగుతోంది. ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గుముఖం పట్టింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 6న జిల్లాలోకి ప్రవేశించింది మొదలు ఇప్పటవరకు అడపదడపా మినహా ఆశించిన వర్షాల్లేవు.. ఈ నేపథ్యంలో అధికారులు నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని గ్రామాల్లో రైతులకు సూచిస్తున్నారు. జిల్లా అంతటా జూలై, ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితులు పెరిగే అవకాశాలున్నాయి. జూన్, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే అతి తక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దాంతో నేలలో విత్తనం పడలేదు. చినుకు కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వ జల సంరక్షణ చర్యలు చేపట్టింది. పొలాల్లో నీటి కుంటల తవ్వకానికి ఊతమిస్తోంది. చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని నీటిని నిల్వ చేసుకుంటే పంట బెట్ట పరిస్థితుల్లో నీటి తడి పెట్టుకోవచ్చు. విత్తనం వేసేందుకు రైతులు తొందరపడవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆగస్టు వరకు చూసి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

## వసతిగృహాల విద్యార్థులకు చలికోట్లు, నైట్‌డ్రస్సులు



**కోట, జూన్ 29 ప్రభాతవార్త** సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయం కల్పిస్తోంది. చదువు ఒక్కటే కాకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తూ అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి చలికోట్లు, టిషర్టులు, నైట్ డ్రస్సులు, తదితర వాటిని సమకూర్చింది. గత ఏడాది కోట్లు వెచ్చించి వసతిగృహాలకు మరమ్మతులు చేయించి ఓ రూపు తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే గదులు అందంగా ముస్తాబు చేసి విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు ఫ్యాన్లను ఏర్పాటు చేసింది. మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించింది. దోమల బెడద లేకుండా ఈ ఏడాది వసతిగృహాల కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయించింది. పాఠశాలల పునః ప్రారంభం తర్వాత హాస్టళ్లకు వచ్చిన విద్యార్థులు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ముందుగానే అవసరమైన సామగ్రిని సరఫరా చేసింది. ఇందులో ఏటా ఇచ్చే బ్లాంకిన్, కార్పెట్‌తో పాటు అదనంగా రెండు రంగుల్లో రెండు జతల నైట్ డ్రస్టులు, చలి నుంచి రక్షణగా స్వెట్టర్, తుడుచుకోవడానికి టర్కీ టవల్ ఉన్నాయి. వీటిని టవళ్లు వేసవి సెలవులకు ముందు అందజేశారు. మిగిలినవి ఈ వారంలో విద్యార్థులకు ఇవ్వనున్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో బాలబాలికలకు కలిపి నాలుగు వేల మంది ఉన్నారని సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తెలిపారు.

## మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర నాయక్

### ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి



**కోవూరు జూన్ 29 ప్రభాతవార్త.** ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర నాయక్ అన్నారు కోవూరులోని జెబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారమైన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలో విద్యార్థుల ప్రతిభా పాటవాలను నిశిత పరిశీలన చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయినించే ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటే వారిలో దాగివున్న అనేక నైపుణ్యాలు వెలుగులోకివచ్చే అవకాశం ఉంటుందన్నారు ఇటీవల శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు పాఠశాలలో అమలు చేసినప్పుడే శిక్షణకు సార్థకత వస్తుందన్నారు అదేవిధంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం కూడా నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు బలవంతమైన పోషకాహారం అందించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు ఈ పరిశీలనలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీహరి ఉపాధ్యాయులు ఉన్నారు

## పశుసంవర్ధక శాఖ డీడీకి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 26, ప్రభాతవార్త** నెల్లూరు పశుసంవర్ధక శాఖ వెటర్నరీ పాలీ క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ టి. సోమయ్యకు పదోన్నతి లభించింది. చింతలదేవి జాతీయ కామదేను పశువృద్ధి కేంద్రం (ఎన్‌కేబిసి) జేడిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జూలై మొదటి వారంలో ఆయన బాధ్యతలు స్వీకరించ నున్నారు. నెల్లూరు పశువైద్యశాలకు ప్రభుత్వం డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించే వరకు ఏడి డాక్టర్ ఎం. మాలకొండయ్య ఇన్చార్జి డీడీగా వ్యవహరించ నున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.సోమయ్యను సోమవారం నెల్లూరులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి



**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వచ్చి ఫారాలు అందిస్తున్నారని, ఇందుకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని కాపు వీధి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వోవారికి కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలో నూరుశాతం లక్ష్యా లు పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

## ధాన్యం రావాణా బకాయిలు రూ.5కోట్లు విడుదల చేయాలి



**కావలి, జూన్ 29 ప్రభాతవార్త :** ధాన్యం రవాణ బకాయిలు రూ.5కోట్లు విడుదల చేయాలని పట్టణ బిజెపి నేతలు డిమాండ్ చేశారు. కావలి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి పార్టీ కావలి 1వ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జనతా వారిధి విభాగం ఆధ్వర్యంలో కావలి రెవెన్యూ డివిజన్ అధికారికి ఒక వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ సివిల్‌సప్లై శాఖ ద్వారా 2022 ఖరీఫ్, రబీసీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినం దుకు లారీ యజమానులకు, రవాణాదారులకు రావాల్సిన సుమా రు రూ.5కోట్లు గత నాలుగు ఏళ్లుగా పెం డింగ్‌లో ఉన్నా య న్నారు. కరోనా తదుపరి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రవాణాదారులు బిల్లుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరు గుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం భాదాకరమన్నారు. ఈ నిదులను త్వరిత గతిన విడుదల చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వలపథకం ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలులో కావలి నియోజకవర్గంలో తీ్ర అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు మహిళలకు అందిస్తుంటే ఏజెన్సీ డీలర్లు ప్రతి సిలిండర్‌పై అదనంగా రూ.200లు అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి దోపిడిలకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, అంచిపాక కమల, డివిజన్ జనతావారది ఇన్‌చార్జ్ కుట్టుబోయిన బ్రహ్మానందం, బిజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపోతుల సాయిక్రిష్ణ, ఓబిసీ వల్లపు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.




## కళ్యాణం..... కమనీయం ......

### శ్రీ ఆత్మారామస్వామి వారి కళ్యాణ వైభోగం



**సంగం జూన్ 29 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన ఆత్మారామస్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారిని గజమాలలతో అలంకరించారు. వేదమంత్రోచ్చరణ నడుమ స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉభయకర్తలు స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు,పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కలిచేటి వేణుగోపాల్‌రెడ్డి, కొండూరు ప్రభాకర్‌రెడ్డి, కీర్తిశేషులు వీరంరెడ్డి మస్తాన్‌రెడ్డి అండ్ సన్స్, కీర్తిశేషులు దొడ్ల బాస్కర్‌రెడ్డి వారి కుటుంబసభ్యులు వ్యవహారించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని కళ్యాణం వీక్షించి పరవశించారు.

## గరుడసేవ ఉత్సవంలో శ్రీ ఆత్మారామస్వామి వారు



**సంగం జూన్ 29 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా స్వామి వారు గరుడసేవ ఉత్స వంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులుస్వామి వారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. స్వామి వారిని గజమాలలతో అలంకరించారు. స్వామి వారు గరుడసేవలో విష్ణుమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కీర్తిశేషులు మెట్టు సీతారామిరెడ్డి కుమారుడు నరేష్‌రెడ్డి, కీర్తిశేషులు నెల్లూర వేమారెడ్డి వారి కుటుంబసభ్యులు, కీర్తి శేషులు మెట్టు సుందరరామిరెడ్డి వారి కుమారులు. మెట్టు వెంకట సుబ్బారెడ్డి, మెట్టు గోపాలకృష్ణారెడ్డి, మెట్టు వెంకట నరసారెడ్డి, కీర్తిశేషులు లేబూరు కౌసల్యమ్మ, కీర్తిశేషులు లేబూరు చంద్రశేఖర్‌రెడ్డి సన్స్ వ్యవహారించారు. భక్తులు పెద్దఎత్తున గ్రామోత్స వంలో స్వామి వారిని దర్శించుకున్నారు.

## మలిదేవి బ్రిడ్జి పనులు పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



**బుచ్చి జూన్ 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో జరుగుతున్న మలిదేవి బ్రిడ్జి నిర్మాణ పనులను ఇరిగేషన్ డిఇ తారకరామారావు పరిశీలించారు. బ్రిడ్జి విషయంపై ఫిర్యాదు రావడం జరిగిందని అందువల్ల బ్రిడ్జి పనులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించడం జరిగిందని ఆయన తెలిపారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌కి పలుసూచనలుచేశారు. పిల్లర్ల వద్దలూస్ మట్టిని తొలగించాలని ఆదేశించారు. పనులో ఎక్కడ నాణ్యత లోపం లేదని ఆయన స్పష్టం చేశారు.ఇరిగేషన్ ఇంజనీర్లు దగ్గరుండే పనులు చేయిస్తున్నట్లు చెప్పారు.

## సహకార సంఘాల సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి





**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** సహకార సొసైటీలో అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కావలి డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నిర్మల తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీలో సోమవారం సహకార వారోత్స వాల్లో భాగంగా సొసైటీ ప్రాంగణంలో జెండా విష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 29వ తేది నుంచి జులై 6వ తేది వరకు సహకార వారోత్స వాలు జరుగుతాయని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలోనే పడుగుపాడు సహకార సొసైటీకి మంచి గుర్తింపు ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని ఆమె సూచించారు. సొసైటీ ఛైర్మన్ శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సహకార వారోత్స వాల్లో సొసైటీ పరిధిలోని రైతులందరూ పాల్గొని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు జయప్రకాష్, శ్రీనివాసులు, రైతులు శివకుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్‌కే బాబు, బాషా, భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు వీపీఆర్ నేత్ర సేవలు వరం





**కోవూరు, జూన్ 29 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలకు వీపీఆర్ నేత్ర సేవలు పూర్తిస్థాయిలో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని, అవి వారికి వరం లాంటిదని మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ పరిధిలో సోమవారం వీపీఆర్ నేత్ర సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పేద ప్రజలకు కంటికి సంబంధించి నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు నూతన వరవడితో ఈ వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కంటికి వెలుగు, జీవితానికి వెలుగు అనే లక్ష్యంతో ఈ వీపీఆర్ నేత్ర సేవలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎంపిటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా వీపీఆర్ దంపతులు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని, ప్రస్తుతం వీపీఆర్ నేత్ర ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఊపిరి నిచ్చారన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ అధినేతలకు పంచాయతీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చింతలపూడి పెంచలయ్య, దోనిపర్తి పురుషోత్తం, బట్టేపాటి మునీంద్ర, రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డి, సుభాన్, శ్రీనివాసులు, బీజేపీ నేత మురళి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా జేష్ట మాస పౌర్ణమి గరుడసేవ

**బిట్రగుంట జూన్ 29 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం జేష్ట మాస గరుడ సేవ ఉత్స వం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఇక్కడ ప్రతి పౌర్ణమి రోజున గరుడ సేవ ఉత్స వం నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ స్వామివారి గరుడసేవ ఉత్స వాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## డయల్ యువర్ ఎస్.ఈ కార్యక్రమానికి ఫిర్యాదులు లేవు



**నెల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు విద్యుత్ భవన్‌లో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్.ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ డివిజన్ల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ విద్యుత్ సంబంధిత సమస్యలను నేరుగా అధికారుల దృష్టికితీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) బాల చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (నెల్లూరు టౌన్) ఎం. శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునింద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహ రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సేవతో పాఠశాలకు కొత్త శోభ

### - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి రాతి విగ్రహ ప్రతిష్ఠ..



**రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు**

విడవలూరు, జూన్ 29 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972 -73 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సరస్వతీదేవి రాతి విగ్రహాన్ని అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తూ ఆదర్శంగా నిలిచారు. పాఠశాల అభివృద్ధి కోసం సుమారు రూ.10 లక్షలకు పైగా వ్యయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణం, 100 బెంచీలు, 50 సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటు, డైనింగ్ హాల్ మరమ్మతులు చేపట్టించారు. విద్యకు ప్రతీక అయిన సరస్వతీదేవి రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా తీర్చిదిద్దారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల సహకారం పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. వారి సహకారం, ప్రోత్సాహంతో విద్యా ప్రమాణాలు మెరుగై పాఠశాల ఉత్తీర్ణత శాతం 52 శాతం నుంచి 95 శాతానికి పెరిగిందని తెలిపారు. పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం ప్రస్తుత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సోమవరపు జనార్ధన్రెడ్డి ఒక విద్యార్థినిని దత్తత తీసుకుని, ఆమె విద్యాభ్యాసానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. మనసేవ సంస్థ వ్యవస్థాపకులు, పూర్వ విద్యార్థి దేవళ్ల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, తాము చదివిన పాఠశాలకు సేవ చేయడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులోనూ పాఠశాల అవసరాలకు తమ వంతు సహకారం కొనసాగిస్తామని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

## జిల్లా కేంద్ర కర్మాగారం నందు న్యాయ విజ్ఞాన సదస్సు





**వెంకటాచలం జూన్ 29 ప్రభాతవార్త** వెంకటాచలం మండలంలోని చెముదు గుంటవద్ద ఉన్న జిల్లా కర్మాగారం నందు హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థకార్యదర్శి సీనియర్ సివిల్‌జడ్జ్ జెపద్మశ్రీ కర్మాగారం నందు మాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కర్మాగారం నందు క్షుణ్ణంగా పరిశీలించి ఖైదీ లెక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనము వసతి వైద్యము ఆరోగ్యము తదితర ఇబ్బందులు ఉంటే తెలపాలని తెలియజే శారు. ఎవరికైనా న్యాయ సేవలు కావాలంటే ఉచితంగా అందజేసి లాయర్ ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైదీలకి ఏమన్నా అవసరమైనప్పుడు లీగల్ సర్వీస్ నెంబర్ ని ఏర్పాటు చేయడం జరిగిందని అతనికి తెలియజేయవచ్చు అని వెల్లడించారు అలాగే మీకు లీగల్ ఉచిత లీగల్ వారింటిని కూడా ఏర్పాటు చేశారన్నారు వారి ద్వారా లెగల్ సర్వీసెస్ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. మహిళా ఖైదీలు వద్దకు వెళ్లి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు కొంతమంది కంటి అద్దాలని కావాలని కోరుతూ కంటేఅద్దాలు ఇప్పిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపర్నెంట్ సన్యాసిరావు , అసిస్టెంట్ డిప్యూటీ చీఫ్ హర్ష, ముజీబ్ సుమతి, పాల్గొన్నారు.

## వవ్వేరు రూరల్ బ్యాంకులో ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు ప్రారంభం



**బుచ్చి జూన్ 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీలో సోమవారం సహకార వారోత్స వాలు ప్రారంభం అయ్యాయి. డిఇఒ గురప్ప, బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ ,డిఎల్‌సిఓ సుభాషిణి జెండాను ఎగుర వేశారు. రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డైరెక్టర్లు మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మమ్మ, సిఇఒ శ్రీనివాసులు, బ్యాంకు సిబ్బంది, సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డిసిఒ గురప్ప మాట్లాడుతు భారతదేశంలో సహకార సంఘాలు చాలా కీలకంగా ఉన్నాయని ఆయన తెలిపారు. జులై 6 వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సహకార సంఘాల బలోపేతానికి సభ్యులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సహకార సంఘాలకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. మన వవ్వేరు బ్యాంకు పరిధిలో త్వరలో ఆధార్ సెంటర్ కూడా ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. పాతకాలంలో సహకార రచ్చబండలు ఏర్పాటు చేసుకునే వారు. ప్రస్తుతం సహకారం సొసైటీలో మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. ఈ సొసైటీలు భావితరాలు వినియోగించుకోనేలా అభివృద్ధి చేయాలని అన్నారు. ఈబ్యాంకు ప్రజల బ్యాంకు అని ఆయన తెలిపారు. ఏరువాక పురస్కరించుకొని రైతులందరు మంచి దిగుబడులు సాధించాలని వారు కాంక్షించారు.